క్లుప్తంగా

రక్తహీనత నివారణకు జాగ్రత్తలు పాటించాలి



గర్భిణీకి పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: గర్భిణులు, రక్తహీనత రాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని నల్లపురెడ్డిపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు రోగులకు, వృద్ధులకు వైద్య పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భిణులు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఐరన్ మాత్రలు తప్పకుండా వాడాలని చెప్పారు. రక్తహీనత రాకుండా మంచి పౌష్టికాహారంతోపాటు తాజా కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. బీపీ, షుగర్‌వ్యాధిగ్రస్తులు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజామణి, ఆరోగ్య పర్యవేక్షకులు రాజశేఖర్, రెడ్డెమ్మ, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, రోజా, ఎంఎల్‌హెచ్‌పీ మానస, డీఈఓ విజయలక్ష్మి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

ఐరాల: త్వరలో నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతవరణంలో జరిగే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కల్లూరు సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ రమేష్‌బాబు హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం పలు గ్రామాల్లో వారు, కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలు ఎన్నికల్లో తమ ఓటుని సద్వినియోగం చేసుకునేందుకు ఎలాంటి భయాందళోనకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పేదలకు మెరుగైన వైద్యం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో నిరుపేదలకు ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందిస్తోందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కోనగుంటలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గజ వాహనంపై పరమేశ్వరుడి విహారం



గజవాహన సేవలో గాండ్లకులస్తులు

చిత్తూరు రూరల్: నగరంలోని శ్రీ అగస్తీశ్వర స్వామి ఆలయంలో బుధవారం పంగుణి బ్రహ్మోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం, రాత్రి విశేష పూజలు, అభి షేకాలు విశేషంగా నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా గాండ్ల కులస్తుల ఆధ్వర్యంలో గజవాహన సేవను అంగరంగవైభవంగా నిర్వహించారు. ఈ సేవలో వైఎస్సార్‌సీపీ నాయకులు భూపేష్ గోపినాథ్ పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు

యాదమరి: మాతా శిశు మరణాలు జరగకుండా ఉండాలంటే వ్యాధి నిరోధక టీకాలు చంటి పిల్లలకు వేయాలని సంతగేటు ప్రభుత్వాస్పత్రి వైద్యులు సిబ్బందిని కోరారు. మండలంలోని కీనాటంపల్లె సచివాలయంలో బుధవారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని వైద్యులు అనిల్‌కుమార్ నాయక్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది గ్రామాల్లో ఉన్న చంటి పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను క్రమం తప్పకుండా వేయాలని కోరారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఓఆర్‌ఎస్‌ను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

చిత్తూరును మోడ్రన్ సిటీగా తీర్చిదిద్దుతా



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి



అభివాదం చేస్తున్న విజయానందరెడ్డి

- వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో జిల్లాకు మహర్దశ
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: ''సుదీర్ఘకాలం తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చిత్తూరుకు అన్ని రకాలుగా మహర్దశ వచ్చింది. మరో ఐదేళ్లలో చిత్తూరును మోడ్రన్ సిటీగా తీర్చిదిద్దుతా.'' అని వైఎస్సార్‌సీపీ చిత్తూరు అభ్యర్థి విజయానందరెడ్డి తెలిపారు. స్థానిక కొంగారెడ్డిపల్లిలో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. అడుగడుగున పువ్వుల వర్షం కురిపించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. నియోజకవర్గంలో అన్ని రకాల సమస్యలు పరిష్కారం కావాలంటే మళ్లీ ఫ్యాన్‌ను ఎన్నికల్లో గెలిపించుకోవాలన్నారు. మనకున్న రోడ్డు కనెక్టివిటీ వల్ల పలు పరిశ్రమలు వస్తాయన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేసుకోవచ్చన్నారు.

ఆటోనగర్‌ను ఆదుకుంటా..!

చిత్తూరు రూరల్: ఆటోనగర్‌లోని సమస్యలను పరిష్కరించి, చేతిపని వాళ్లను ఆదుకుంటామని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి అన్నారు. చిత్తూరు నగరంలోని ఆటోనగర్‌లో బుధవారం ఆటోనగర్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, టీడీపీ ప్రభుత్వం పేదలను అణగదొక్కుతోందన్నారు. చిత్తూరు అభివృద్ధిని పూర్తిగా అడ్డుకుందని చెప్పారు. దీంతోపాటు ఉన్న ఫ్యాక్టరీలను మూత వేయించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. పలు ఫ్యాక్టరీలు, పెద్ద పెద్ద కంపెనీలను కూడా చిత్తూరుకు రానివ్వలేదని గుర్తుచేశారు. దీంతో నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు లేక రోడ్డున పడే పరిస్థితులు ఎదురయ్యారన్నారు. దీనికి అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతోనే ఎస్‌ఆర్‌పురంలో ఐటీ హబ్ తీసుకొచ్చామన్నారు. రానున్న రోజుల్లో చిత్తూరును మోడ్రన్ సిటీగా తీర్చిదిద్దుతున్నామని హామీ ఇచ్చారు. భారీ కంపెనీలకు ఆహ్వానం పలికి నిరుద్యోగ యువతకు స్థానింగానే ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రధానంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుద్యోగ సమస్యను తగ్గించాలనే ఉద్దేశంతోనే సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని చెప్పారు. ఆటోనగర్‌లోని సమస్యలను పరిష్కరించేలా కచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న రోజుల్లో ఆటోనగర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ రాహుల్ రెడ్డి, ఆటోనగర్ అధ్యక్షుడు సురేష్, నాయకులు అక్బల్‌భాను, సుబ్రమణ్యం, రామ్‌బాబురెడ్డి, సుక్కుభాయ్, గోపినాథ్, ఉమాపతి, మారా, పటేల్, ఔరాబాబు, ప్రకాష్, రఘు పాల్గొన్నారు.

చిత్తూరు గెలుపు జగనన్నకు కానుకగా ఇవ్వాలి

చిత్తూరు చరిత్రలో చిరస్థాయిలో ఉండిపోయేలా తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా రెడ్డెప్పను అత్యధిక మెజారిటీతో గెలిపించి జగనన్నకు కానుకగా ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జగనన్న ఆశీసులతో జరిగిన అభివృద్ధి, ప్రతి ఇంటికీ అందిన సంక్షేమ పథకాలు, అందుకున్న లబ్ధిదారులపై తనకు నమ్మకం ఉందన్నారు. దుష్టశక్తుల గారడీ మాటలకు మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో మేయర్ అముద, నగర పార్టీ అధ్యక్షులు టిమ్ము, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, టౌన్ బ్యాంకు చైర్మన్ రాంగణేష్, ఎంపీటీసీలు ప్రతిమారెడ్డి, గోళ్లహరిప్రసాద్‌చౌదరి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు అప్పాజీ, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

బంగారుపాళెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఓపెన్ స్కూల్ పరీక్ష కేంద్రాన్ని బుధవారం డీఈఓ దేవరాజులు తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. పరీక్షలో అవకతవకలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పదోతరగతి పరీక్షలు సజావుగా నిర్వహించాలన్నారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఓటును వినియోగించుకోండి



ర్యాలీలో పాల్గొన్న ఉపాధి, డ్వాక్రా మహిళలు

పూతలపట్టు: ఓటర్లు తమ ఓటుహక్కును తప్పకుండా వినియోగించుకోవాలని ఏపీఎం నాగరత్న తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఉపాధి ఉద్యోగులు, డ్వాక్రా మహిళలు కలిసి ఓటర్ల అవగాహనపై ర్యాలీ నిర్వహించారు. నూతన ఓటర్లు తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకునేలా గ్రామ స్థాయిలోని మహిళలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పక అవగాహన కల్పించాలని సూచించారు. మరింత ఓటర్లను చైతన్య పరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సంధ్యారాణి, సీసీలు శోభన్, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్నికల ప్రచార సభ

పూతలపట్టు: మండలంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ గురువారం ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం పోటుకనుమ, అయ్యప్పగారిపల్లి, తిమ్మిరెడ్డిపల్లెల్లో పర్యటించనున్నట్లు తెలిపారు.

మరింత మెరుగ్గా పారిశుధ్య పనులు



కార్మికురాలితో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరంలో పారిశుధ్య పనులను మరింత మెరుగ్గా చేపట్టాలని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. బుధవారం 40, 48వ వార్డు పరిధిలోని ఇందిరానగర్, తంగవేలు కాలనీ, కైలాసపురం రోడ్డు, ప్రకాశం వీధి తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించి పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ప్రధాన రోడ్లు, వీధులను ఉదయం వీలైనంత త్వరగా శుభ్రం చేయాలన్నారు. శ్మశాన దారిలో పడే వ్యర్థాలను ఏ రోజుకారోజు శుభ్రం చేయాలని ఆదేశించారు. మురుగునీటి కాలువల్లో పూడికతీత పనులు పూర్తి చేయించాలని, అంతర్గత రహదారులను శుభ్రంగా ఉంచాలన్నారు. గృహాల వద్ద వ్యర్థాలను తడి, పొడిగా స్వీకరించేలా పారిశుధ్య కార్మికులకు అవగాహన పెంచాలని చెప్పారు. పనులు జరుగుతున్న తీరు, లోపాలపై పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం ఉండకూడదని వార్డు పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులను ఆదేశించారు. కమిషనర్ వెంట ప్రజారోగ్య అధికారులు, వార్డు కార్యదర్శులు ఉన్నారు.

వాహనాలపైన రాజకీయ నేతల చిత్రాలు వద్దు

ప్రభుత్వానికి సంబంధించిన అన్ని వాహనాలపై ఎలాంటి రాజకీయ నేతల బొమ్మలు, లోగోలు, గుర్తులు ఉండొద్దని కమిషనర్ అరుణ స్పష్టం చేశారు. చిత్తూరు పరిధిలోని ప్రభుత్వ సంస్థల వాహనాలైన 108, 104, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, ఇంటింటికీ రేషన్ సరఫరా చేసే వాహనాలను బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. వాహనాలపై ఎక్కడా రాజకీయపరమైన అంశాలు కనిపించకూడదన్నారు. అన్ని వాహనాల వివరాలను నమోదు చేయించాలని ఆదేశించారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజనీరు గోమతి, ఇన్‌చార్జ్ ఎంహెచ్‌వో చిన్నయ్య ఉన్నారు.

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించుకుందాం

- బాబు మాయమాటలు నమ్మకండి
- పిలుపునిచ్చిన డాక్టర్ సునీల్‌కుమార్
- బుడితరెడ్డి పల్లె పంచాయతీలో పర్యటన



మహిళలతో మాట్లాడుతున్న డాక్టర్ సునీల్‌కుమార్

యాదమరి: 'సంక్షేమ పథకాలు గడప ముంగిటకే అందిస్తున్న సంక్షేమ సారథి జగనన్నను మళ్లీ గెలిపించుకుందాం. ఎన్నికల రాగానే చంద్రబాబుకు ప్రజలు గుర్తుకొస్తారు. మాయమాటలతో మరోసారి మోసం చేయడానికి దిగిపోయారు. ఆయన మాటలు నమ్మకండి.' అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆయన బుధవారం జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డితో కలిసి మండలంలోని బుడితరెడ్డి పల్లెలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ వాసుదేవ రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సారి కూడా ఫ్యాను గుర్తుకే మా ఓటు.. జగనన్నే సీఎం అంటూ మహిళలందరూ ముక్తకంఠంతో తెలిపారు.

జగనన్న సీఎం అయితేనే పథకాలు కొనసాగుతాయి

ఎన్నికల ప్రచారం అనంతరం గ్రామస్తులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ జగనన్న మళ్లీ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. చంద్రబాబులాగా ఎన్నికల ముందు 600 హామీలిచ్చి, అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని బుట్టలో వేయలేదని గుర్తు చేశారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు. చంద్రబాబు ఈ సారి ఎన్నికల్లో కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని చెప్పారు. పొత్తుల జిత్తులతో ప్రజల ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ఈ సారి కూడా బూటకపు మేనిఫెస్టోను తయారు చేసుకుని వస్తారని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రజలందరూ విజ్ఞతతో ఆలోచించి, ఫ్యానుగుర్తుపై ఓటేసి జగనన్నను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మనోహరన్, నాయకులు కార్తిక్‌రెడ్డి, మనోజ్ రెడ్డి, హరనారాయణ రెడ్డి, రవీంద్రబాబు పాల్గొన్నారు.

వంద పని దినాలు పూర్తి చేయాలి



ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న డ్వామా పీడీ రాజశేఖర్

ఐరాల: ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులు ప్రతి కూలీ వంద రోజుల పని దినాలను పూర్తి చేయాలని డ్వామా పీడీ రాజశేఖర్ ఆదేశించారు. మండలంలోని వైఎస్ గేటు, మద్దిపట్లపల్లె, ముదిగోళంలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులు, కూలీల సౌకర్యాలను పరిశీలించారు. ముందుగా వైఎస్ గేటులో ఉపాధి హామీ కింద చేపడుతున్న డీసెల్టింగ్ పనులు పరిశీలించి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. మద్దిపట్లపల్లెలో రోజా పూల పెంపకంపై తనిఖీ చేసి, సంబంధిత రైతుతో మాట్లాడారు. ముదిగోళం పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న ఫారంపాండ్ పనులను పరిశీలించారు. వేతనదారులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. పీడీ మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున వేతనదారులు ఉదయం 6 గంటల నుంచి 11 వరకు మాత్రమే పనులు చేయాలని సూచించారు. తిరిగి సాయంత్రం వేళ పనులు ప్రారంభించాలన్నారు. ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఏపీఓ సంధ్యకు డ్వామా పీడీ సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసులు, టీఏలు శరత్‌బాబు, భాస్కర్, ఎఫ్ఏలు భానుప్రకాష్, రమేష్ పాల్గొన్నారు.

సమయానికి పనులకు హాజరుకావాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ రాజశేఖర్

పూతలపట్టు: ఉపాధి పనులకు వెళుతున్న కూలీలు సమయానికి పనులకు హాజరుకావాలని డ్వామా పీడీ రాజశేఖర్ తెలిపారు. ఆయన బుధవారం మండలంలోని వడ్డేపల్లి, పూతలపట్టు, తలపులపల్లి పంచాయతీ పరిధిలోని ఫిష్, ఫారంపాండ్‌ల పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడుతూ ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఉదయం 6 గంటలకు విధులు హాజరై 11 గంటలకు ఇంటికి చేరుకోవాలన్నారు. మిగిలిన పనులను సాయంత్రం పూట పూర్తి చేసుకోవాలని సూచించారు. ఉష్ణోగ్రత అధికంగా ఉండడంతో వీలైనంత వరకు మంచినీరును ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కూలీలకు వేతనాలు విషయంలో నిర్లక్ష్యంగా వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సంధ్యారాణి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శేషుడిపై కరకంఠేశ్వరుడు

నగరి : పట్టణ పరిధిలోని కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న పంగుణోత్తర కల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం కరకంఠేశ్వర స్వామిని శేష వాహనంపై ఊరేగించారు. ఆలయంలో అభిషేక అర్చనలు నిర్వహించారు. ప్రత్యేక అలంకారంలో ఊరేగింపుగా వచ్చిన స్వామికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు ఇచ్చి భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సంక్షేమ సేవా సంఘం వారు ఉభయదారులుగా వ్యవహరించారు.

ఆకట్టుకున్న 'ఫుడ్ ఫెస్టివల్'

కార్వేటినగరం: స్థానిక శ్రీలక్ష్మీ నరసింహ ప్రైవేటు హైస్కూల్లో బుధవారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. ఎంఈఓలు విజయకుమార్, మనోజ్‌కుమార్ దీనిని ప్రారంభించి మాట్లాడారు. క్రిమి సంహార మందులు, రసాయన ఎరువులతో పండించినవి కాకుండా ప్రకృతి వ్యవసాయోత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదనే కాన్సెప్ట్‌తో ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. కరస్పాండెంట్ దిలీప్‌కుమార్, డైరెక్టర్లు ధనంజయరెడ్డి, వెంకటేష్, పురుషోత్తం, హెచ్‌ఎం మహేశ్వర్‌రాజు పాల్గొన్నారు.

ఉద్యోగులు నియమావళిని పాటించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ చిన్నయ్య



మాట్లాడుతున్న తహసీల్దార్ అరుణకుమారి

పూతలపట్టు: నియోజకవర్గంలోని ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని ఆర్డీఓ, నియోజకవర్గ ఆర్వో చిన్నయ్య తెలిపారు. మండలంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం వీఆర్వో, వీఆర్‌ఏ, సచివాలయాల సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది గ్రామీణ స్థాయిలో పరిశీలించి రాజకీయ పార్టీలకు సంబంధించిన గుర్తులు, ముఖ చిత్రాలను తొలగించాలని సూచించారు. రాజకీయ పరంగా గొడవలు వంటివి జరిగినప్పుడు వెంటనే తహసీల్దార్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారికి తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రచార కార్యక్రమంలో పాల్గొనకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రమణ్యం రెడ్డి, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, రెవెన్యూ అధికారులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

నియమావళి అమలు చేయాల్సిందే

తవణంపల్లె: ఎన్నికల నియమావళిని మండలంలోని అధికారులు తప్పనిసరిగా అమలుచేయాలని మండల ఎన్నికల అసిస్టెంట్ అధికారి, తహసీల్దార్ అరుణకుమారి ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎన్నికల నియమావళిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ అరుణకుమారి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ నాయకుల ఫొటోలు, పోస్టర్లు బహిరంగ, ప్రభుత్వ స్థలాల్లో ఉంటే తక్షణమే తొలగించాలని ఆదేశించారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా తమ పేరును బీఎల్వోల వద్ద నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాక మునుపే చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి, ఫ్లయింగ్ స్క్వాడ్ హెడ్ రెడ్డిబాబు, డీటీ నరేష్‌కుమార్, భూ రీసర్వే డీటీ వెంకటరమణ, పోలీసులు, బీఎల్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ముగ్గులతో ఓటుపై చైతన్యం



చిత్తూరులో ముగ్గులు వేస్తున్న మహిళలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేషన్ అధికారులు

చిత్తూరు అర్బన్: ఓటు హక్కు వినియోగంపై మహిళల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ యంత్రాంగం ముగ్గుల పోటీ నిర్వహించింది. అందమైన సందేశాత్మక రంగవల్లులతో మహిళలు తమ భావాలను చూపించారు. సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రామ్ (స్వీప్)లో కార్యక్రమాల్లో భాగంగా కట్టమంచి చెరువు కాలినడక ప్రాంతంలో బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి మహిళలు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొని ఓటింగ్ ప్రక్రియ, ఈవీఎంల వినియోగం, ఈవీఎం నమూనా, ఓటరు చైతన్యం, నైతికత అంశాలపై ముగ్గులను తీర్చిదిద్దారు. మెప్మా బృందం ముగ్గులను పరిశీలించి ఉత్తమంగా ఉన్న వాటిని ఎంపిక చేసి బహుమతులను అందించారు. విజయలక్ష్మి, సుమ, లావణ్యకు మొదటి మూడు బహుమతులను స్వీప్ నోడల్ అధికారి, ఇన్‌చార్జ్ ప్రజారోగ్యశాఖ అధికారి చిన్నయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సి.వెంకటేష్ బహుమతులను అందించారు. కార్యక్రమంలో నగరపాలక స్వీప్ బృందం, మెప్మా సీఓలు, మహిళలు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణం కల్పించండి

పూతలపట్టు: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఆర్డీఓకు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని ఆర్‌వీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేయబోయే కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై ఆరా తీశారు. అత్యవసర వసతులను అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. సార్వత్రిక ఎన్నికలకు మోడల్ ఆఫ్ కోడ్ నియమావళిని అనుసరించి ఎన్నికలను జయప్రదం చేయాలని తెలిపారు. వీరి వెంట ఆర్డీఓ చిన్నయ్య, తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు